క్లుప్తంగా

గురుకులంలో శ్రీకృష్ణ విగ్రహం ప్రతిష్ఠాపన



యజ్ఞం చేస్తున్న పండితులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని సాందీపని వేద గురుకులంలో ఆదివారం నిర్వాహకుడు పడకంటి సంగమేశ్వర్ శ్రీకృష్ణుడి విగ్రహాం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గురుకులంలో హోమం, గోపూజ ఘనంగా నిర్వహిం చారు. ఆచార్య సత్యమిత్ర ప్రవచనం చెప్పారు. దీంతో గురుకులంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమీషన్ పెంపుపై రేషన్ డీలర్ల హర్షం



ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మండల రేషన్ డీలర్లు

కొల్చారం(నర్సాపూర్): రేషన్ డీలర్ల కమీషన్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రేషన్ డీలర్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఈ సందర్భంగా వారు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని వాళ్ల నివాసంలో కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపినట్లు మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు ప్రభాకర్ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయ జెండాల పంపిణీ



రామాయంపేటలో జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): పట్టణంలో జాతీయ జెండాలను మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పంపిణీ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇంటింటికీ జెండాల పంపిణీకి 12 వార్డులకు 12 టీంలను ఏర్పాటు చేశారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఎన్‌జీవై కాలనీలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దత్తాత్రేయ కులకర్ణి, కార్యదర్శి సంపత్ రనదివే, సభ్యులు వెంకటేష్ గౌడ్, నర్సింగ్ రావు, భూపతి గౌడ్, సంతోష్, మురళి, మల్లేశ్ యాదవ్, నవీన్ గౌడ్, సాయిబాబా, గోపాల్, రమేశ్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచారు. రూ. 25 కే జాతీయ జెండాను పోస్ట్ ఆఫీస్‌లో అందిస్తున్నట్లు పోస్ట్ మాస్టర్ రమణ తెలిపారు.


సీసీరోడ్డు పనులు ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని 1, 2, 3 వార్డుల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనగా సీసీ రోడ్డు పనులను ఆదివారం గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ రోడ్డు పనుల కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వార్డు మెంబర్లు సురేశ్, శంకరయ్య, రంగంపేట పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గేశ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి రమేశ్, సంగమేశ్వర్, మైనార్టీ నాయకుడు గౌస్ పాషా, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం నియోజకవర్గంలోని పాపన్నపేట మండలం కొంపల్లి, సీతానగరం, ఎంకెపల్లి గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

గంగమ్మకు తెప్పోత్సవం



ర్యాలీగా వెలుతున్న గ్రామస్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామస్తులు ఆదివారం గంగమ్మ తెప్పోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులంతా డప్పు చప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి చెరువు వద్ద పూజలు చేశారు. చెరువు నుంచి నీటిని తీసుకొచ్చి నల్ల పోచమ్మకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని చదువులు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- ఇరుకు గదుల్లో బోధన
- కానరని మౌలిక వసతులు
- రంగంపేట ఉన్నత పాఠశాలలో నెలకొన్న పరిస్థితి

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, మౌలిక వసతులు లేక ఇరుకైన గదుల్లో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు, ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని చెప్పిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు, బోధనకు అవసరమైన ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా బోధనపై ప్రభావం పడే పరిస్థితి వచ్చింది. ఇది కొల్చారం మండలం రంగంపేట ఉన్నత పాఠశాల నెలకొన్న దుస్థితి.



గదుల కొరతతో వరండాల్లోనే విద్యా బోధన

అన్నీ ఇబ్బందులే..



పాఠశాలలో 300 వరకు బాలికలు చదువుతున్నారు. అవసరమైన టాయిలెట్లు, తాగునీరు అందుబాటులో లేవు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల చదువు ఎలా ముందుకు సాగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలు చేర్పించాలని చెబుతున్న అధికారులు సౌకర్యాలు కూడా కల్పించాలి.
– మాజీద్, విద్యార్థిని తండ్రి

పాఠశాలల్లో సౌకర్యాలు ఇలా....

- జిల్లాలో అత్యధికంగా రంగంపేట ఉన్నత పాఠశాలలో 589 మంది విద్యార్థులు ఉన్నారు.
- పాఠశాల విద్యార్థుల్లో బాలురు 321, బాలికలు 268. ఇక్కడ 6 నుంచి 10వ ప్రగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన కొనసాగుతోంది.

ప్రస్తుతం బోధనకు అనుకూలంగా ఉన్న గదులు 9 కాగా ఆంగ్లం, తెలుగు వేర్వేరుగా బోధన చేపట్టాల్సిన పరిస్థితుల్లో గదుల కొరత ఇబ్బందిగా మారింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 21 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ప్రస్తుతం 16 మంది ఉపాధ్యాయులతో మాత్రమే బోధనను నెట్టుకొస్తున్నారు. ప్రధానంగా ఫిజికల్ సైన్స్ 2, బయో సైన్స్ 2, హిందీ ఒకటి ఖాళీగా ఉన్నాయి. దీంతో సంబంధిత సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనకబడే పరిస్థితి ఇక్కడ నెలకొంది.

- ఇదే సమయంలో లాగ్వేజ్ సబ్జెక్టులు బోధించే సమయంలో ఒక్కో తరగతి గదిలో 100 మంది విద్యార్థులను కూర్చోబెట్టి బోధిస్తున్నారు. దీంతో గది ఇరుకుగా ఉండటంతో చివర కూర్చున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠాలు వినలేని పరిస్థితి ఉంది.
- విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. బాలికల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు, మరుగుదొడ్లు లేవు.
- మరోవైపు మగ పిల్లల సంఖ్య అత్యధికంగా ఉంది. దీంతో పాఠశాలలో వీరికి ఎక్కడ కనీసం ఒక్క టాయిలెట్ కూడా లేకపోవడంతో పాఠశాల గేటు దాటి రోడ్లపైకి వెళ్తున్నారు.
- ఉపాధ్యాయులే స్వయంగా మగ పిల్లలను టాయిలెట్ కోసం బయటకు తీసుకు వెళ్లాల్సిన దుస్థితి ఇక్కడ కనిపిస్తోంది.
- విద్యార్థులు ఇంటి నుంచి బాటిల్లో నీటిని తీసుకొని రావాల్సిందే. మధ్యాన్న భోజన సమయంలో నీటికి ఇబ్బందులు తలెత్తడంతో స్థానికంగా ఉన్న చాలా మంది విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు.

టాయిలెట్లు లేవు



పాఠశాలలో మాకు టాయిలెట్లు లేవు. రోడ్డుపైకి రావాల్సి వస్తోంది. మొన్నటి రోడ్డు ప్రమాదంలో మా తోటి విద్యార్థులు చనిపోయారు. దీంతో రోడ్డుపైకి వెళ్లాలంటే భయమేస్తుంది. మాకు అవసరమైన టాయిలెట్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలి. – వంశీ, 8వ తరగతి విద్యార్థి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఉన్నత పాఠశాల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడ్డాయి. బోధనకు ఇబ్బందికరంగా ఉండడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టిన అసంపూర్తి దశలో ఉన్నాయి. సమస్యలపై, అవసరమైన సౌకర్యాల కోసం అధికారులకు నివేదికలు పంపాం.
– ఖాజావలీ, హెచ్‌ఎం, రంగంపేట

పీర్ల ఊరేగింపు



నర్సాపూర్: పీర్ల ఊరేగింపులో సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నిర్వహించిన పీర్ల ఉత్సవంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సుధాకర్‌రెడ్డి, షేక్ హుస్సేన్, నగేశ్, కందిశంకర్, కాలనీ వాసులు బాల్‌రాజ్, బాబా, ఇస్మాయిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని అల్లాపూర్‌లో పీర్ల పండగ కులమతాలకు అతీతంగా జరుపుకున్నారు.

'కులవృత్తిపై మాట్లాడలేదు'

శివ్వంపేట(నర్సాపూర్): గౌడ కులవృత్తిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఈత వనాల రైతు సంఘం మండలాధ్యక్షుడు బాలేశ్, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈత చెట్ల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం పోత్సహించడం వల్ల మా పట్టా భూముల్లో ఈత వనం పెంచామని, అందుకు సంబంధించి సంఘం ఏర్పాటు చేసుకొని పిట్ల సత్యనారాయణను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నమన్నారు. గౌడ సంఘం నేతలు అతన్ని విమర్శించడం సరికాదన్నారు.

'రంగంపేటను మండల కేంద్రంగా ప్రకటించాలి'

కొల్చారం(నర్సాపూర్): గతంలో వ్యాపార వాణిజ్య మండల కేంద్రంగా కొనసాగిన రంగంపేటను తిరిగి మండల కేంద్రంగా సీఎం కేసీఆర్ ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని ఇప్పటికే హామీ ఇచ్చి ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు.

నిధులు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పండి ?

- బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్



మాట్లాడుతున్న గోవింద్

చేగుంట(తూప్రాన్): మూడేళ్లుగా దుబ్బాక అసెంబ్లీ అభివృద్ధి నిధులను ఆపేసిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి నిధులను ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలని బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ అన్నారు. చేగుంటలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి అసెంబ్లీ అభివృద్ధి నిధులు రాకుండా ఎంపీ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో దుబ్బాక సమస్యలను ప్రస్తావిస్తూ నిరంతరం ఏదో ఒక గ్రామంలో అభివృద్ధి కోసం పని చేస్తున్న ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు మాట్లాడటం సరికాదన్నారు. తొమ్మిదేళ్ల ఎంపీ నిధుల ఖర్చుపై ఎంపీ చర్చకు రాగలరా అని ప్రశ్నించారు. అబద్ధాల ప్రచారం ఆపేసి గ్రామాల అభివృద్ధికి నిధులనువెంటనే మంజూరీ చేయించేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్, గణేశ్ రవికుమార్, భిక్షపతి, హరిశంకర్, సాయిప్రసాద్, మణి మహేశ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం



భాస్కర్‌రెడ్డి(ఫైల్)

చేగుంట(తూప్రాన్): బీజేపీ కార్యకర్త మృతిపై దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని మక్కరాజీపేట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి(26) సికింద్రాబాద్ అల్వాల్‌లో ఉంటూ క్యాబ్ నడుపుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అల్వాల్‌లోని అద్దె ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో బీజేపీ కార్యకర్తగా చురుకుగా పనిచేసిన భాస్కర్‌రెడ్డి మృతిపై ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ శ్రీనివాస్, రెడ్డి సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటకు చెందిన 1998 – 99 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు ప్రస్తుతం చేస్తున్న పనులపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తలారి లింగం, నర్సింలు, దేవేందర్, భాను, అమీన, జయ, శ్యామ్, స్వామి, సంతోష్, లక్ష్మణ్, రవి, రాజు, శ్రీను, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి

- గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన యువకులు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న యువకులు

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ యువకులు ఆదివారం మండల కేంద్రం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు సుమన్, జగదీశ్, మహేశ్ తదితరులు మాట్లాడుతూ.. రేగోడ్ మండలం మెదక్ జిల్లాలో ఉండటం కారణంగా మండలంలోని ఎంతోమంది యువత కొద్ది మార్కులతో ఉద్యోగాలను పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాల భవిష్యత్, యువతకు ప్రైవేట్ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి కల్పన, సామాన్య పౌరులకు సైతం జిల్లా అధికారులు పరిపాలన సౌలభ్యానికి పోరాడుతుంటే కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరుద్యోగులకు సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్ కారణంగా ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. భౌగోళికంగా మెదక్ జిల్లా కంటే సంగారెడ్డి జిల్లానే రేగోడ్ మండలానికి అనుకూలంగా ఉంటుందని తెలిసినప్పటికీ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం మెదక్ జిల్లాలో రేగోడ్ మండలాన్ని కలిపి యువత భవిష్యత్‌ను బలి చేశారని అన్నారు. ప్రజల భవిష్యత్‌పై నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ శ్రీకాంత్ నాయక్, సతీశ్, పరమేశ్వర్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల సంఘం పుస్తక ఆవిష్కరణ

తూప్రాన్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి పక్కన చక్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం బేడ బుడగ జంగం పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎస్సీ చైతన్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో ఆల్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్నార్ వెంకటేశం, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి జగదీశ్వర్, వైస్ చైర్మన్ చింతల యాదగిరి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ బేడ బుడగ జంగాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆ సంఘం చింతల దశరథకు సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ శరత్ చందు, చిరంజీవి, గోపాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ ప్రధాన రహదారిలో గుంతలుండటంతో యువత నడుంబిగించి రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా రోడ్డుపై ఉన్న గుంతలతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో గ్రామ యువకులు తమ సొంత ఖర్చులతో రోడ్డులో ఉన్న గుంతలను కాంక్రీట్‌తో పూడ్చివేశారు.

ఆలయాల్లో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్ గ్రామ శివారులో గల మంజీరా నది ఒడ్డున వెలిసిన చాముండేశ్వరీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న స్వచ్ఛభారత్

తూప్రాన్: మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో ఆదివారం 372వ వారం గ్రామస్తులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఐజల్ వాటర్ ప్లాంట్ వద్ద ఉన్న మినీ ట్యాంకు దగ్గర ఉన్న చెత్తా చెదారాన్ని తీసేసి చుట్టుపక్కల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మేకిన్ మల్కాపూర్ యూత్ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత 278వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం గ్రామంలోని హరితవనంలో, బుద్ధ విగ్రహం వద్ద గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ బాధితులకు అండగా ఉంటాం

శివ్వంపేట(నర్సాపూర్): బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శివ్వంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వంజరి కొండల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అలాగే తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోల్‌దాస్ వెంకట్‌స్వామి పాముకాటు అనంతరం చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆదివారం వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

◆ రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): దివంగత శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ వాకిటి లక్ష్మారెడ్డి గారి స్మారకార్థం రేపు నిర్వహించే రక్తదానం శిబిరం విజయవంతం చేయాలని కొంతన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం లక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు.

◆ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని దొంతి నివాసి, అపోలో ఆస్పత్రి కంటి వైద్యుడు సంజయ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అండాలమ్మ సంజయ్‌రెడ్డి దంపతులు వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. 22 మందికి కంటి అపరేషన్లు అవసరం ఉండగా వారికి మెడిసిటీ ఆస్పత్రిలో చేయించనున్నట్లు చెప్పారు. పుట్టి పెరిగిన గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందివ్వడంపై వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ లాయక్, పిట్ల సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

◆ పార్టీలకతీతంగా పథకాలు అమలు చేయండి

హవేళీఘనపూర్: గ్రామాల్లో పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందించి, అందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సర్దన సర్పంచ్ సుభాశ్ అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు మాత్రం బీసీబంధు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల కోసం అధికార పార్టీ వారు లిస్టులు తయారు చేసి ఇవ్వడం వల్ల అసలైన లబ్దిదారులకు పథకాలు అందడం లేదని ఆరోపించారు. గ్రామంలో గ్రామసభ పెట్టి అర్హులు ఎవరు గుర్తించినట్లయితే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

◆ హన్మంతరావును కలిసిన వెంకట్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హన్మంతరావును హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ సేవాదల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం కోసం దుబ్బాక నియోజకవర్గానికి రావాలని కోరినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు. సానుకూలంగా స్పందించిన హన్మంతరావు ప్రచారానికి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

◆ శేరితండాలో వన భోజనాలు



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండా పంచాయతీలో ఆదివారం తండావాసులు వనభోజనాలు నిర్వహించారు. దేవతామూర్తులకు పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు.

◆ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళలు బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ వినోద తెలిపారు. ఆదివారం చిలప్‌చెడ్ గ్రామ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రతీ నెల క్రమం తప్పకుండా రుణాలు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ హన్మంత్, సీసీ పురుషోత్తం, వీఓఏ మమత మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నర్సాపూర్: పట్టణంలో ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించి పట్టణంలోని పలు వీధులు, ప్రధాన రహదారుల మీదుగా చేపట్టి పార్టీ ఆఫీస్ వద్దకు చేరుకున్నారు. ర్యాలీలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిన్న రమేశ్‌గౌడ్, పార్టీ నాయకులు రఘువీరారెడ్డి, రాజేందర్, ప్రేంకుమార్, యాదగిరి, రవిగౌడ్ పాల్గొన్నారు.

◆ సన్మానం



శివ్వంపేట(నర్సాపూర్): జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ ఆదివారం విశిష్ట సేవ అవార్డు అందుకున్నారు. పింగళి వెంకటయ్య స్మారకార్థం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జలసంఘం చైర్మన్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు వేణుగోపాలచారి చేతుల మీదుగా హరికృష్ణ అవార్డు అందుకున్నారు.

◆ కోరుట్లకు బయలుదేరిన పద్మశాలి నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కోరుట్లలో జరుగుతున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి మండల పద్మశాలి సంఘం నాయకులు ఆదివారం బయలుదేరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కిష్టయ్య, తదితరులు ఉన్నారు.